
సాక్షి
మంచిర్యాల
శుక్రవారం । 3 । మే । 2024


మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గిరిజన జాతర

- 'ఆసిఫాబాద్' సభకు తరలివచ్చిన ప్రజలు
- కుమురంభీం, రాంజీగోండులను స్మరిస్తూ ఉత్సాహం నింపిన సీఎం
- ఆదివాసీ బిడ్డ సుగుణను గెలిపించాలని పిలుపు
- ఉమ్మడి జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుకు హామీ
- రేవంత్‌రెడ్డి పర్యటనతో కాంగ్రెస్‌లో జోష్

ఆసిఫాబాద్: గిరిజన పోరాట వీరులు కుమురంభీం, రాంజీగోండులను స్మరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి చేసిన ప్రసంగం కాంగ్రెస్‌ పార్టీ క్యాడర్‌లో జోష్‌ నింపింది. మండుతున్న ఎండల్లోనూ జనజాతర సభకు ఉమ్మడి జిల్లా నుంచి ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు. పార్లమెంట్‌ కాంగ్రెస్‌ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆసిఫాబాద్‌ జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌ పక్కన ఖాళీ స్థలంలో గురువారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అధ్యక్షతన నిర్వహించిన జనజాతర బహిరంగ సభ విజయవంతమైంది. వారం రోజుల నుంచి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, జిల్లా నాయకులతో కలిసి జనసమీకరణ చేపట్టారు. సభ ప్రారంభంలో ప్రాంగణం ఖాళీగా కనిపించినప్పటికీ చివరకు కుర్చీలు పూర్తిగా నిండిపోయాయి. ఖాళీగా ఉన్న కుర్చీల్లోకి ప్రజలను అనుమతించాలని డీసీసీ అధ్యక్షుడు పలుమార్లు పోలీసులను కోరడం కనిపించింది. ఎస్పీ సురేశ్‌కుమార్‌ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. సభకు వచ్చిన వారిని అడుగడుగునా తనిఖీ చేశారు.

మరాఠీ పాటలు.. ప్రసంగాలు

జనజాతర సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం మూడు గంటలకు వస్తారని కాంగ్రెస్‌ నేతలు ప్రకటించారు. హైదరాబాద్‌ నుంచి హెలికాప్టర్‌లో సాయంత్రం 4 గంటలకు ఆయన ఆసిఫాబాద్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా బహిరంగ సభ వేదిక వద్దకు వచ్చారు. ముఖ్యమంత్రి రాక ఆలస్యం కావడంతో అప్పటివరకు కళాకారులు మరాఠీ పాటలు, నృత్యాలతో అలరించారు. ఉమ్మడి జిల్లా నాయకులతోపాటు ఆదివాసీ, దళిత సంఘాల నాయకులు ప్రసంగించారు. కొంతమంది నేతలు మరాఠీలో ప్రసంగించగా.. మరికొందరు తెలుగులో మాట్లాడారు. సీఎం రాక ముందే డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ ఇన్‌చార్జి జాదవ్‌ నరేశ్‌, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్‌, నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్‌ ప్రసంగించారు. సభావేదిక పైకి చేరుకోగానే ముఖ్యమంత్రి స్టేజీని ఆనుకుని ఏర్పాటు చేసిన ర్యాంపుపై తిరుగుతూ ప్రజలు, కార్యకర్తలకు అభివాదం చేశారు.


సభకు హాజరైన ప్రజలు

సంక్షేమం.. విమర్శలు

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఆదిలాబాద్‌ కాంగ్రెస్‌ అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రసంగం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తొలుత అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించిన ఆయన.. ఆ తర్వాత బీజేపీ, బీఆర్‌ఎస్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. దాదాపు 25 నిమిషాల పాటు ముఖ్యమంత్రి ప్రసంగం కొనసాగింది. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 'ఇక్కడ సాగు నీరు, పోడు భూముల సమస్య ఉంది. ఈ ప్రాంతంలోని ప్రాజెక్టులు ఏళ్ల క్రితం మంజూరైనప్పటికీ.. ప్రాజెక్టుల్లో నీరున్నప్పటికీ సాగుకు ఉపయోగపడటం లేదు. లక్షన్నర ఎకరాలకు సాగు నీరందించే అవకాశం ఉన్నా గత పాలకుల నిర్లక్ష్యంతో సాగు నీరందడం లేదు' అంటూ విమర్శించారు. కుమురం భీం ప్రాజెక్టు పూర్తయినా, కాల్వల నిర్మాణం చేపట్టలేదని మండిపడ్డారు. ఏళ్లుగా ఆసిఫాబాద్‌ మండలంలోని గుండి బ్రిడ్జి అసంపూర్తిగా ఉందని గుర్తు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాకు యూనివర్సిటీ ఇస్తామని హామీ ఇచ్చారు. 'సీసీఐ పరిశ్రమ మూతపడిందని, ఈ ప్రాంతంలో సిమెంట్‌ పరిశ్రమ వస్తే అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రిజర్వేషన్ల రద్దుకు ప్రయత్నిస్తున్న బీజేపీని మీరు రద్దు చేయాలని పిలుపునిచ్చారు. అక్రమంగా కేసులు పెట్టారని.. కుమురంభీం, రాంజీగోండు స్ఫూర్తిగా పోరాడుతామని స్పష్టం చేశారు. రిజర్వేషన్లు ఉండాలి.. పోడు భూముల పట్టాలు అందాలంటే ఆత్రం సుగుణ గెలవాలని కోరారు. ఈ సందర్భంగా 'బీజేపీ ఏమిచ్చిందంటే గాడిద గుడ్డు ఇచ్చింది అని.. ఆత్రం సుగుణకు లక్ష మెజార్టీ అంటే పక్కా' అని ప్రజలతో అనిపించి ప్రసంగం ముగించారు. సమావేశంలో మాజీ మంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రేవంత్‌రెడ్డికి కుమురంభీం ఫొటో అందిస్తున్న సీతక్క, ఆత్రం సుగుణ, తదితరులు

కొంగు చాపి అడుగుతున్నా..



కొంగుచాపి అడుగుతున్న ఒక్క అవకాశం ఇవ్వండి.. ఆదరించి గెలిపించండి. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం. 75 సంవత్సరాల చరిత్రలో ఆదివాసీ మహిళకు ఏ పార్టీ అవకాశం ఇవ్వలేదు. కాంగ్రెస్‌ పార్టీ అవకాశం ఇచ్చింది. ఆదివాసీ బిడ్డను గెలిపించాలి. ఆదిలాబాద్‌ ఎంపీ స్థానం రాహుల్‌ గాంధీకి గిఫ్ట్‌ ఇవ్వాలి. అభివృద్ధి పనులు, ఆరు గ్యారంటీలను చూసి ఓటేయండి.

– ఆత్రం సుగుణ, ఆదిలాబాద్‌ కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి

ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తా



జిల్లాలోని ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తా. కేంద్రంలో అధికారం ఇవ్వండి. జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా. ప్రాజెక్టులు, రోడ్ల అభివృద్ధితోపాటు ఆరె కులస్తులు, మాలి కులస్తుల సమస్యలు పరిష్కరించి అన్నివర్గాల సంక్షేమానికి పాటు పడతా. మహిళలకు వడ్డీలేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. ప్రజల ఆశలను నెరవేర్చేది కాంగ్రెస్‌ పార్టీయే.

– సీతక్క, ఉమ్మడి జిల్లా మంత్రి

రిజర్వేషన్ల రద్దుకు కుట్ర



ప్రధాని నరేంద్ర మోదీ ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసే కుట్ర చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ ఆదివాసీ దేవుళ్లను ఎప్పుడూ పూజించడు. గతంలో ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా పని చేసిన నగేశ్‌ ప్రజలకు చేసిందేమీ లేదు. బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు కూడా అదే బాటలో ఉన్నారు. కాంగ్రెస్‌ పార్టీ సామాన్యురాలైన ఆదివాసీ మహిళ ఆత్రం సుగుణకు టికెట్‌ కేటాయించింది. అత్యధిక మెజార్టీతో గెలిపించాలి.

– వెడ్మ బొజ్జు, ఖానాపూర్‌ ఎమ్మెల్యే

న్యూస్‌రీల్‌

నేటి నుంచి పోస్టల్‌ పోలింగ్‌

మంచిర్యాలఅగ్రికల్చర్‌: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నేటి నుంచి ఈ నెల 8లోపు పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటు హక్కు వినియోగానికి అవకాశం కల్పించారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 6,584 మంది పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటర్లు ఉన్నారు. ఉద్యోగులు, ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వస్తున్న అధికారులు, సిబ్బంది ఉన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవాలని మంచిర్యాల నియోజకవర్గ ఆర్వో రాములు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర సర్వీసుల్లో కొనసాగే ఉద్యోగులతోపాటు అత్యవసర, ప్రింట్‌ అండ్‌ ఎలక్ట్రానిక్‌ మీడియా పాత్రికేయులు, పోలింగ్‌ విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.

పోలింగ్‌ రోజున పొరపాట్లకు తావివ్వొద్దు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ బి.సంతోష్‌
- ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ


శిక్షణలో కలెక్టర్‌ సంతోష్‌, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్‌: ఎన్నికల పోలింగ్‌ రోజున ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ బదావత్‌ సంతోష్‌ అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో సహాయ రిటర్నింగ్‌ అధికారులు, తహసీల్దార్లు, సెక్టార్‌ అధికారులు, హోం ఓటింగ్‌, ఫెసిలిటేషన్‌ సిబ్బందికి ఈవీఎం కమిషనింగ్‌, పోస్టల్‌బ్యాలెట్‌, హోం ఓటింగ్‌, పోలింగ్‌ డే, ఎన్నికల సంబంధిత అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్‌ రాహుల్‌, మంచిర్యాల, చెన్నూర్‌ నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారులు రాములు, చంద్రకళలతో కలిసి కలెక్టర్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ కంట్రోల్‌, బ్యాలెట్‌ యూనిట్లు, వీవీ ప్యాట్ల అనుసంధానంపై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, ఇద్దరు పోలింగ్‌ ఏజెంట్ల సమక్షంలో మాక్‌ పోలింగ్‌ నిర్వహించిన అనంతరం పోలింగ్‌ ప్రారంభించాలని తెలిపారు. మాక్‌పోల్‌లో ఏమైనా సమస్య ఉంటే సంబంధిత ప్రిసైడింగ్‌, సెక్టార్‌ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో ఈ నెల 3 నుంచి 8వరకు హోం ఓటింగ్‌ నిర్వహించనుండగా, మంచిర్యాల నియోజకవర్గంలో 4, 5వ తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఓటింగ్‌పై సమాచారం అందించాలని, అధికారులు వచ్చిన సమయంలో ఓటు హక్కు వినియోగించుకోలేకపోతే రెండోసారి వస్తారని, అప్పుడు కూడా వినియోగించుకోలేని పక్షంలో ఓటు వేసే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు వేయాలని పేర్కొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



పాల్గొన్న కలెక్టర్‌ బి. సంతోష్‌

మంచిర్యాలఅగ్రికల్చర్‌: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రతీ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీనియర్‌ డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌ నితీష్‌ వ్యాస్‌ అన్నారు. గురువారం న్యూఢిల్లీ నుంచి సీనియర్‌ ఎన్నికల కమిషనర్‌, హైదరాబాద్‌ నుంచి ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌ రాజ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో ఎన్నికల ప్రక్రియ, పోలింగ్‌ నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సీనియర్‌ డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహించాలని తెలిపారు. కలెక్టర్‌ బి.సంతోష్‌, అధికారులు పాల్గొన్నారు.

రెడ్‌జోన్‌లో తొమ్మిది మండలాలు

మంచిర్యాలఅగ్రికల్చర్‌: జిల్లా ఎండలు దంచికొడుతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు 46డిగ్రీలకు పైగా, కనిష్ట ఉష్ణోగ్రతలు 40డిగ్రీలకు వరకు నమోదవుతున్నాయి. గురువారం జిల్లాలో తొమ్మిది మండలాలు రెడ్‌జోన్‌, తొమ్మిది మండలాలు ఆరెంజ్‌ జోన్‌లోకి చేరాయి. గరిష్ట ఉష్ణోగ్రత 46.3డిగ్రీలు నమోదు కాగా, కనిష్ట ఉష్ణోగ్రత 40డిగ్రీలుగా నమోదైంది. రోజురోజుకు పెరుగుతున్న ఎండ ప్రచండంతో జనాలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. రోజువారీ కూలీ, సింగరేణి కార్మికులు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం సమయంలో జన సంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

ఆస్పత్రిలో ఉంటేనే సెలవులు


రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆసుపత్రి

- సింగరేణిలో వింత వైఖరి
- కార్మికులు బెడ్‌పై ఉండాల్సిందే..!
- ఇంటికి వెళ్తామంటే గైర్హాజరే..

శ్రీరాంపూర్‌: ప్రమాద సెలవుల విషయంలో సింగరేణి యాజమాన్యం నిబంధనలు కార్మికులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఆస్పత్రిలో ఉంటేనే సెలవులు మంజూరు చేస్తామనే నిబంధనపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గనిలో ఏదైనా ప్రమాదం జరిగితే కార్మికులను చికిత్స నిమిత్తం సమీప ఏరియా ఆస్పత్రికి తరలిస్తారు. కాలు విరిగితే కట్టుకట్టి కొద్ది రోజులు ఆస్పత్రిలో బెడ్‌పై ఉంచి చికిత్స తర్వాత ఇంటికి పంపేవారు. మళ్లీ నెల రోజుల తర్వాత కట్టు విప్పి కొద్ది రోజులు ఇంటి నుంచి వచ్చి ఫిజియోథెరపీ చేయించి పూర్తిగా కోలుకున్నాకే ఫిట్‌ ఫర్‌ డ్యూటీ ఇచ్చేవారు. అప్పటి వరకు కంపెనీ యాక్సిడెంట్‌ లీవులు ఇచ్చేది. ఇప్పుడు ఆ విధానాన్ని మార్చి కొత్త నిబంధనలు తెచ్చారు. కట్టిన కట్టు విప్పే వరకు బెడ్‌పైనే ఉంచుతున్నారు. చివరికి ఫిజియోథెరపీ కూడా బెడ్‌పై ఉండే చేయించుకోవాలి. ఇలా నెలల తరబడి క్షతగాత్రులను కంపెనీ ఆస్పత్రుల్లో ఉంచి వైద్యం అందించే విధానంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రుల్లో ఇన్‌పేషంట్‌గా ఉంటేనే ప్రమాద సెలవులు ఇస్తున్నారు. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుని మళ్లీ వస్తామంటే గైర్హాజరు వేస్తున్నారు. పెరిగిన సాంకేతికత కారణంగా రోగిని వీలైనంత త్వరగా ఆస్పత్రి నుంచి పంపి తిరిగి రివ్యూకు రమ్మని వైద్యం అందిస్తున్న ఈ రోజుల్లో కంపెనీ నిర్ణయం కాలం చెల్లిన వైద్య విధానాన్ని గుర్తు చేస్తోందని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా ఈ విధానం అమలు చేయడంపై కార్మికుల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది.

ఉండనంటే గైర్హాజరే..

అన్ని రోజులు ఆస్పత్రుల్లో ఇన్‌పేషెంట్‌గా ఉండడం ఇష్టం లేని వారు వైద్యులతో గొడవపడి ఇంటికి వెళ్తున్నారు. వారం రోజులు ఆస్పత్రిలో ఉండి తర్వాత ఇంటికి వచ్చి పూర్తిగా కోలుకున్నాక ఫిట్‌ కోసం వెళ్తే రికవరీ కాలానికి సెలవులు ఇవ్వక గైర్హాజరుగా వేస్తున్నారు. కార్మికులు ఇంటికి వెళ్తే గనులపైకి వైద్య అధికారులు నోటీసులు పంపించి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో చాలామంది క్షతగాత్రులు ఆస్పత్రుల్లో రోజుల తరబడి మగ్గాల్సి వస్తోంది. వద్దనుకుంటే ఆర్థికంగా సెలవులు నష్టపోవాల్సి వస్తోందని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు. తీవ్రంగా గాయపడిన వారికి కార్పొరేట్‌ ఆస్పత్రుల్లో కంపెనీ చికిత్స అందిస్తోంది. సింగరేణి ఆస్పత్రుల్లాగే పూర్తిగా కోలుకునే వరకు అక్కడ చికిత్స ఎందుకు అందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. అక్కడ కొద్ది రోజులకే డిశ్చార్జీ చేసి ఇంటి వద్ద ఫీజియోథెరపి చేసుకొని రివ్యూకు రమ్మని చెబుతున్నారు.

సమీక్షలు కరువు

సింగరేణిలో అధికారుల నిర్ణయాల అమలుపై పర్యవసానాలు, సత్ఫలితాలు ఇస్తుందా..? దుష్ఫలితాలు ఇస్తుందా..? అని పై అధికారుల వద్ద సమీక్షించే విధానం లేకుండా పోయింది. కార్మిక సంఘాలు ప్రశ్నించేందుకు వేదికైన స్ట్రక్చరల్‌ సమావేశాలు, సేఫ్టీ ట్రైపార్టీయెట్‌ సమావేశాలు కంపెనీ నిర్వహించడం లేదు.

ఎక్కడో ఏదో జరిగిందని

ఆస్పత్రిలో చికిత్స తర్వాత ఇంటి వద్ద రికవరీలో కార్మికులు సరిగ్గా ఫిజియోథెరపీ చేయడం లేదని, ఇతర అనారోగ్యం పాలవుతున్నారనే కొద్ది కేసుల ఆధారంగా కంపెనీ ఈ విధానం తీసుకొచ్చిందని తెలిసింది. కార్మికులను ఇంటి సమీపంలోనే ఫిజి యోథెరపీ చేయించుకోమని చెప్పి సెలవులు ఇవ్వడం కోసం అక్కడే అటెండెన్స్‌ పెట్టాలని, ఇబ్బందులు ఉండవని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

ఇంటిల్లిపాది ఇబ్బంది..

రోగి వద్ద ఉండడం, అతడికి కావాల్సిన దుస్తులు, ఇతర అవసరాల కోసం కుటుంబ సభ్యులు నెలలు తరబడి కంపెనీ ఆసుపత్రి చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇంటి వద్ద ఉంటే ఆస్పత్రిలో కంటే మెరుగైన భోజనం లభిస్తుందని, కుటుంబ సభ్యులతో ఉండడం వల్ల త్వరగా కోలుకుంటామని కార్మికులు పేర్కొంటున్నారు.

ఈ నిబంధన ఎత్తివేయాలి



క్షతగాత్రులు పూర్తిగా రికవరీ అయ్యే వరకు బెడ్‌పైనే ఉంచి వైద్యం చేయాలని, ఇంటికి వెళ్లి రికవరీలో ఉన్న కాలానికి లీవ్‌లు ఇవ్వకపోవడం సరికాదు. ఈ కొత్త విధానం రద్దు చేయాలి. ఇది ఎప్పటిదో పాత కాల వైద్య విధానం. దీని పర్యావసానంగా చిన్న చిన్న ప్రమాదాలకు గురైన వారిని గని అధికారులు రిపోర్టులు రాయకుండా ప్రైవేటుకు వెళ్లి చికిత్స చేసుకోండని, కొద్ది రోజులు ఫ్రీ మస్టర్‌ ఇస్తామని చెప్పి మ్యానేజ్‌ చేసే ప్రమాదం ఉంది.

– వీ.సీతారామయ్య, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు

ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటున్నాం. మైన్‌ యాక్సిడెంట్‌ అయిన వారిని బయటికి పంపకుండా పూర్తిగా రికవరీ అయిన తర్వాతనే ఇంటికి పంపిస్తున్నారు. ఇక్కడే వైద్యుల పర్యవేక్షణ, ఫిజియోథెరపీ చేయిస్తున్నాం. ఈ విధానంపై రోగులు తమ దృష్టికి తీసుకు వస్తున్న ఇబ్బందులను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– డాక్టర్‌ ఉషా, ఏసీఎంఓ, ఆర్కేపీ ఏరియా ఆసుపత్రి

విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉండొద్దు

- ఎన్పీడీసీఎల్‌ సీజీఎం రాజుచౌహాన్‌
- జిల్లాలో సబ్‌స్టేషన్ల సందర్శన


బెల్లంపల్లిలో సిబ్బందితో సీజీఎం రాజుచౌహాన్‌

బెల్లంపల్లి/చెన్నూర్‌/మందమర్రిరూరల్‌/రామకృష్ణాపూర్‌: విద్యుత్‌ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండొద్దని, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్‌ హన్మకొండ చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌(సీజీఎం) రాజుచౌహాన్‌ విద్యుత్‌ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన బెల్లంపల్లిలో 33/11కేవీ, 132కేవీ విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లు సందర్శించారు. చెన్నూర్‌ విద్యుత్‌ కార్యాలయంలో సెక్షన్‌ విద్యుత్‌ అధికారులు, లైన్‌మన్‌లతో సమావేశం అయ్యారు. మందమర్రి మండలం అందుగులపేట, రామకృష్ణాపూర్‌ పట్టణంలోని విద్యుత్‌ సబ్‌ స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా సీజీఎం రాజుచౌహాన్‌ మాట్లాడుతూ ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. 2022–23లో 26ఎంయూ నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 36 ఎంయూ అధిక లోడు పెరిగిన కూడా అంతరాయం లేకుండా కరెంట్‌ సరఫరా జరుగుతోందని పేర్కొన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గోల్‌ బంగ్లాబస్తీ నుంచి ఏఎంసీ వరకు ఇంటర్‌ లింకింగ్‌ లైన్‌, 600కే యార్‌ కెపాసిటర్స్‌ ఆకెనపల్లి, చిత్తాపూర్‌, లక్ష్మీపూర్‌, నీల్వాయి, ఆల్గాం, నెన్నెల, ఆవుడం 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు ప్రత్యామ్నాయం కోసం సమకూర్చాలని ఆదేశాలు జారీ చేశారు. భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ప్రమాద నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమాల్లో బెల్లంపల్లి డిస్కం డీఈ రాజన్న, ఏడీఈలు రవికుమార్‌, రాజశేఖర్‌, ఏఈలు శ్రీనివాస్‌ మల్లేశం, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌ కుమ్మక్కు రాజకీయాలు

- ఈ నెల 4న మాజీ సీఎం కేసీఆర్‌ రోడ్‌ షో
- బీఆర్‌ఎస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌


మాట్లాడుతున్న బాల్క సుమన్‌, దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్‌: దేశంలో బీజేపీ, కాంగ్రెస్‌ పార్టీలు మాత్రమే ఉండాలని కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నాయని, బీజేపీకి లేదంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ఎన్నికలకు వెళ్తున్నాయని బీఆర్‌ఎస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ విమర్శించారు. జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి ఆయన నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్‌, బీజేపీలు ఒకటిగా ఎన్నికలకు వెళ్తున్నాయనే దానికి సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా నేషనల్‌ చానల్‌లో మోదీకి ఓటు వేయమని చెప్పడమే నిదర్శనమని, పశ్చిమబంగాల్‌లో కాంగ్రెస్‌ నేత అభిరంజన్‌ చౌదరి తృణమూల్‌ కాంగ్రెస్‌కు ఓటు వేయడం కంటే బీజేపీకే ఓటు వేయాలన్న వీడియోలను చూపించారు. ఈ నెల 4న మాజీ సీఎం కేసీఆర్‌ మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో పెద్దపల్లి బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహిస్తారని తెలిపారు. బీజేపీని గెలిపించేందుకు కరీంనగర్‌లో కాంగ్రెస్‌ పార్టీ బలహీన అభ్యర్థిని, కాంగ్రెస్‌ను గెలిపించేందుకు పెద్దపల్లిలో బీజేపీ బలహీన అభ్యర్థులను బరిలో నిలిపాయని ఆరోపించారు. చెన్నూరులో తాను ఇసుక దందా చేస్తున్నట్లు ఆరోపించిన వివేక్‌, మరి అదే ఇసుక క్వారీలను ఇప్పటికీ ఎందుకు మూసేయించలేదని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ కేసీఆర్‌ సభను విజయవంతానికి పెద్దఎత్తున ప్రజలు, బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్‌ ఫ్లోర్‌ లీడర్‌ అంకం నరేశ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ సందెల వెంకటేశ్‌, డీసీసీబీ డైరెక్టర్‌ ఎర్రం తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు అదనపు బ్యాలెట్లు

మంచిర్యాలఅగ్రికల్చర్‌: జిల్లాలో పోలింగ్‌ నిర్వహణకు అదనపు బ్యాలెట్‌ యూనిట్లు వచ్చాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ బి.సంతోష్‌ అన్నారు. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల్లో 42 మంది అభ్యర్థులు పోటీలో ఉండడంతో అదనపు బ్యాలెట్‌ యూనిట్లు అవసరం అయ్యాయి. ఈసీఐఎల్‌ కంపెనీ నుంచి జిల్లాకు 1,800 అదనపు యూనిట్లు రాగా గురువారం ఈవీఎం గోదాంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌, మోతిలాల్‌, ఎన్నికల తహసీల్దార్‌ శ్రీనివాస్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో ప్రథమ స్థాయి పరిశీలన నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ జిల్లాలోని చెన్నూర్‌, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాలకు కేటాయించిన ప్రకారం బందోబస్తు మధ్య తరలించి స్ట్రాంగ్‌ రూమ్‌లో భద్రపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

244ఎకరాలకు పంట నష్ట పరిహారం

మంచిర్యాలఅగ్రికల్చర్‌: జిల్లాలో మార్చిలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలకు పరిహారాన్ని రేపో మాపో రైతుల ఖాతాల్లో జమ కానుంది. 376 మంది రైతులకు 244.01 ఎకరాల పంటకు రూ.24,40,100 పరిహారం అందనుంది. మార్చి 19, 20న అకాల వర్షాలతో 383 మంది రైతులు 444.2 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. దండేపల్లి మండలంలోని 13 గ్రామాల్లో 231 మంది రైతులు 288 ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టపోయినట్లు గుర్తించారు. లక్సెట్టిపేట మండలంలోని 11 గ్రామాల్లో 108 మంది రైతుల వరి, మొక్కజొన్న, నువ్వు పంటలకు 69.2 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. జన్నారం మండలంలో 6 గ్రామాల్లో 44 మంది రైతులు 87 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, నువ్వు పంటలు నష్టపోయారు. వడగండ్లతో నష్టానికి దండేపల్లి మండలంలో 324 మంది రైతుల 206.15 ఎకరాలకు రూ.20,61,500, జన్నారంలో 52 మంది రైతుల 38.07 ఎకరాలకు గాను రూ.3,87,000 ఖాతాలో జమ చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

కవ్వాల్‌లో ఆగని కలప స్మగ్లింగ్

- రాయికుంట బీట్‌లో విలువైన టేకు చెట్లు నరికివేత
- దుంగలను తరలించిన అక్రమార్కులు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో కలప స్మగ్లింగ్ ఆగడం లేదు. కఠినంగా ఉండాలని ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేసినా కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా విలువైన టేకు చెట్లు నేలకొరుగుతున్నాయి. గతంలో పాతవి, పడిపోయిన చెట్లను తీసుకెళ్లే స్మగ్లర్లు ఇప్పుడు విలువైన టేకు చెట్లను ముక్కలుగా నరికి దుంగలను తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. జన్నారం అటవీ డివిజన్‌లోని పలు బీట్లలో స్మగ్లింగ్ జరుగుతున్నట్లు ఇటీవల జరిగిన పలు సంఘటనల ద్వారా తెలుస్తోంది. గతంలో కారుతో కలప తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు అడ్డుకుని వాహనాన్ని సీజ్ చేశారు. ఇస్లాంపూర్ నుంచి కలప తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు.

చెట్లు నరికి ముక్కలు చేసి..

జన్నారం అటవీ డివిజన్‌లోని ఇందన్‌పల్లి రేంజ్ కవ్వాల్ అటవీ సెక్షన్, రాయికుంట బీట్‌లో కొందరు స్మగ్లర్లు విలువైన టేకు చెట్లను నరికి దుంగలను తరలించారు. చెట్ల మొదళ్లను పరిశీలిస్తే ఈ నరికివేత ఇటీవల కాలంలోనే జరిగినట్లు తెలుస్తోంది. రెండు విలువైన టేకు చెట్లను నరికి ముక్కలుగా చేసి



స్మగ్లర్లు నరికిన టేకు చెట్టు

అపహరించుకు పోయారు. మొదలు, చివరను అక్కడే వదిలేశారు. మరో చెట్టు దుంగను తరలించి ఏర్పడకుండామొదలుకు నిప్పు పెట్టారు. ఈ తతంగమంతా జరుగుతున్నా సంబంధిత అధికారులు అటుగా దృష్టి సారించకపోవడం గమనార్హం.

గోదావరి దాటుతోందా?

జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట్ రేంజ్ పరిధిలోని పలు బీట్ల నుంచి స్మగ్లర్లు గుట్టుచప్పుడు కాకుండా కలపను గోదావరి దాటిస్తున్నట్లు తెలుస్తోంది. అటవీ ప్రాంతంలోని పలు బీట్‌ల నుంచి స్మగ్లర్లు కలపను తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎడ్లబండ్లు, వాహనాల ద్వారా గోదావరి వరకు తీసుకెళ్లి అక్కడి నుంచి గోదావరినది దాటించి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. గతంలో ఎఫ్‌డీవో మాధవరావు హయాంలో రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ, గోదావరి తీర ప్రాంతాల్లో గస్తీ తిరిగేవారు. కొన్ని రోజులుగా అధికారులు దృష్టి సారించకపోవడంతో అక్రమార్కులు కలప రవాణాకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయమై జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్‌ను 'సాక్షి' వివరణ కోరగా తనిఖీ చేయాలని సంబంధిత రేంజ్ అధికారిని ఆదేశించినట్లు తెలిపారు. రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

గతంలో ఇద్దరిపై వేటు..

నెల రోజుల క్రితం ఆసిఫాబాద్ డివిజన్‌లోని జోడేఘాట్ రేంజ్ పరిధిలో కొందరు స్మగ్లర్లు అక్రమంగా నిల్వచేసిన కలపను అక్కడి అధికారులు పట్టుకున్నారు. ఆ కలప కవ్వాల్ సెక్షన్ నుంచి వచ్చినట్లు అనుమానం రావడంతో ఉన్నతాధికారులు బీట్ తనిఖీలు చేయించారు. తనిఖీల్లో రాయికుంట బీట్ నుంచి కలప తరలించినట్లు తేలడంతో ఉన్నతాధికారులు బీట్ అధికారి, సెక్షన్ అధికారులను సస్పెండ్ చేశారు. ఈ సంఘటన జరిగి నెల రోజులు గడువక ముందే మరో సంఘటన జరగడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. సెక్షన్ పరిధిలోని అధికారులు వారికి కేటాయించిన క్వార్టర్‌లో ఉండకుండా నిత్యం రాకపోకలు చేయడంతో రాత్రి పూట స్మగ్లర్లు తమ పని సులువుగా కానిచ్చేస్తున్నారు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాల ద్వారా, నెత్తి మోతల ద్వారా సైజులను తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

వడదెబ్బతో ఒకరి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

బెజ్జూర్: మండలంలోని గబ్బాయి గ్రామానికి చెందిన పోర్తి శ్రీనివాస్(40) గురువారం వడదెబ్బతో మృతి చెందాడు. రెండు రోజుల క్రితం దహెగాం మండలంలోని పోలంపల్లిలో జరిగిన శుభకార్యానికి వెళ్లాడు. ఈ క్రమంలో వాంతులు, విరేచనాలు కావడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య జానాబాయి, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులోని రాజేశ్వర్‌రావుపల్లెలో గురువారం మధ్యాహ్నం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి రూ.6,100 నగదు, రెండు పేకాట సెట్లు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో గడ్డం రవీందర్‌రెడ్డి, మారు వెంకటరెడ్డి, సీపెల్లి మొగిళి, గాడిపెల్లి సురేందర్, ఎనగందుల వెంకటేశ్, ఎనగందుల నందయ్య ఉన్నారు.

యువకుడిపై కేసు

తాండూర్: అన్నదమ్ములను దూషించడమే కాకుండా వారిపై చేయి చేసుకున్న ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు మాదారం ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపారు. తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌కు చెందిన మడికంటి శ్రావణ్, సన్నాయిల రాజు గురువారం ఉదయం ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్లారు. అక్కడ ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తనతో గొడవ పెట్టుకున్న శ్రావణ్‌ను చితగ్గొట్టాలనే ఉద్దేశంతో రాజు అతని ఇంటికి వెళ్లి బూతులు తిట్టాడు. అతని అన్న మడికంటి సతీష్ అక్కడికి వెళ్లి ఎందుకు తిడుతున్నావని అడిగాడు. కోపంతో ఊగిపోయిన రాజు సతీష్‌ను సైతం కొట్టి దుస్తులు చించేశాడు. బాధితుల ఫిర్యాదుతో నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు లారీలు ఢీ.. తప్పిన ప్రమాదం

జైపూర్: మండలంలోని ఇందారం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం రాత్రి రెండు లారీలు ఢీకొన్నాయి. జైపూర్ పవర్ ప్లాంటు నుంచి మంచిర్యాల వైపు బూడిద లోడ్‌తో వెళ్తున్న లారీని మంచిర్యాల నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న మరో లారీ క్రాస్ రోడ్డు వద్ద వెనుక నుంచి ఢీకొట్టింది. లారీలు బలంగా ఢీకొన్నప్పటికీ డ్రైవర్లకు ఎలాంటి గాయాలు కాలేదు. పెద్ద ప్రమాదం తప్పిందని ఎస్సై శ్రీధర్ తెలిపారు.

ఆర్టీసీ జేఏసీ కార్యవర్గం ఎన్నిక

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మంచిర్యాల డిపోలో టీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటైంది. ఈ సందర్భంగా జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా వి.భీమేశ్వర్ రావు, చైర్మన్‌గా తోట సత్తయ్య, కోశాధికారిగా నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మామిడిపల్లి శ్రీనివాస్, కోకన్వీనర్లుగా కేఎస్ రావు, గోలి శంకర్, దుర్గయ్య, రాజేశం, కార్యవర్గ సభ్యులుగా జ్యోతి, మురళి, పీఆర్ రావు, శంకర్, రాజేశ్వర్, అనూష, రమేశ్, బాపన్న ఎన్నికైనట్లు కన్వీనర్ వీబీరావు తెలిపారు.

కల్పనకే మాలమహానాడు మద్దతు

పాతమంచిర్యాల: వరంగల్ పార్లమెంటు అభ్యర్థి పంజా కల్పనకే మాల మహానాడు ఆఫ్ ఇండియా మద్దతు ఉంటుందని మాల మహానాడు ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ బీఎస్పీ అభ్యర్థి పంజా కల్పన మాల సామాజిక వర్గానికి చెందిన వారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారు బీఎస్పీకి ఓటు వేసి కల్పనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు పుల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి మధు, కే.రాజారాం, కోశాధికారి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడిన వ్యక్తి గుర్తింపు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో బుధవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని స్థానిక శ్రీశ్రీనగర్‌కు చెందిన జాగటి నారాయణ (59)గా గుర్తించినట్లు మంచిర్యాల జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్న నారాయణ బుధవారం ఇంటినుంచి బయటకు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య దుర్గ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిదర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్కే 7లో వెంటిలేషన్ సమస్య తీర్చాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గనిలో కార్మికులు వెంటిలేషన్ లేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి బాజీసైదా గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. వెంటిలేషన్ లేక పని స్థలాల వద్ద తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, నాణ్యమైన పనిముట్లు ఇవ్వడం లేదని, సైకిల్ షెడ్డు సరిపోవడం లేదని, సీఎంపీఎఫ్ రుణాలు పెండింగ్‌లో ఉన్నాయని నాయకుల దృష్టికి తెచ్చారు. అనంతరం నాయకులు గని మేనేజర్, ఏజెంట్‌ను కలిసి సమస్యలపై చర్చించారు. త్వరితగతిన పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

రావు, సహాయ కార్యదర్శి మోతుక్కూరి కొమురయ్య, ఏరియా కార్యదర్శులు ప్రసాద్‌రెడ్డి, మారపల్లి సారయ్య, బుచ్చయ్య, పిట్ సెక్రెటరీ బేర రవీందర్, నాయకులు దాడి రాజయ్య, మోతె లచ్చయ్య, ఆకుల లక్ష్మణ్, గునిగంటి నర్సింహారావు, సంగం సదానందం, అఫ్రోజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో పనిచేస్తే లక్ష్య సాధన

- జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: పక్కా ప్రణాళికతో ముందుకెళ్తే వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సులువుగా సాధించవచ్చని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. గురువారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి ముందస్తుగానే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బొగ్గు ఉత్పత్తితో పాటు గనుల్లో రక్షణ చర్యలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించేలా ఉద్యోగులను కార్యోన్ముఖులను చేయాలన్నారు. వేసవి ఎండల దృష్ట్యా ఉద్యోగులకు తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారులు ఎం.శ్రీనివాస్, టీ.శ్రీనివాస్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏజెంట్లు గోపాల్ సింగ్, రాముడు, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జీఎం

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న కార్మికులు

నెన్నెల: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల కార్మికులు గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వేతనాలు వెంటనే మంజూరు చేయాలంటూ నినాదాలు చేశారు. నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జీతాలు ఇవ్వకపోతే విధులు బహిష్కరించి ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

నగదు పట్టివేత



నగదు అప్పగిస్తున్న పోలీసులు

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద గురువారం రాత్రి నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.98 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా కరీంనగర్‌కు చెందిన ఎండీ అక్రం వద్ద రూ.98 వేల నగదు లభించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో నగదును సీజ్ చేసి ఎస్ఎస్‌టీ టీంకు అప్పగించినట్లు తెలిపారు. సరైన పత్రాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు వెంట తీసుకెళ్లరాదని సూచించారు.

హత్య కేసులో ఆరుగురికి జీవితఖైదు

వాంకిడి: మండలంలోని ఖిరిడి గ్రామంలో జరిగిన హత్య కేసులో ఆరుగురికి జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.వీ రమేశ్ గురువారం తీర్పునిచ్చినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. భూతగాదాలో 2019 జూన్ 21న తొడాసం బొజ్జిరావు, సెడ్మకె గంగారాం, సెడ్మకె తెలంగ్‌రావు, సెడ్మకె యశ్వంత్‌రావు, సెడ్మకె జంగు, తొడసం శారద ఖిరిడి గ్రామానికి చెందిన రాయిసిడాం శ్యాంరావు(52), రాయిసిడాం తారాబాయి (45) దంపతులను గ్రామ శివారులో గొడ్డళ్లతో నరికి హత్య చేశారు. మృతుల కుమారుడు రాయిసిడాం విలాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అప్పటి సీఐ రాణాప్రతాప్ నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుత సీఐ శ్రీనివాస్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో ఆరుగురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ.15 వేల చొప్పున జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

బీజేపీతోనే పేదల అభివృద్ధి

కోటపల్లి: బీజేపీతోనే పేదల అభివృద్ధి సాధ్యమని ఎంపీ వెంకటేశ్ నేత అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఎంపీ వెంకటేశ్‌నేత, బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ మాట్లాడారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలుకానీ హామీలిచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. మళ్లీ మోదీనే ప్రధాని అవుతారని, గోమాస శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్ సమర్థవంతంగా నిర్వహించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీశాఖ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ నిర్వహిస్తామని, చెన్నూర్ నియోజకవర్గంలో 1,311, బెల్లంపల్లిలో 1,691, మంచిర్యాలలో 3,853 మందికి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో



పోస్టల్ బ్యాలెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్ వివిధ విభాగాల పర్యవేక్షకులు, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్ పాల్గొన్నారు.

తనయుడి గెలుపు కోసం తండ్రి ప్రచారం

- ఓటర్లను అభ్యర్థించిన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

నెన్నెల: తన తనయుడు పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఓటర్లను అభ్యర్థించారు. గురువారం నెన్నెల, గన్‌పూర్, మైలారం, కొత్తూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వంశీని గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. మే 13న జరుగనున్న ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి వంశీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నెన్నెల, మైలారంలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధి కూలీల వేతనాలు రోజుకు రూ.400 పెంచుతామన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను సీఎం రేవంత్



ఉపాధి కూలీకి తట్ట ఎత్తుతున్న ఎమ్మెల్యే

రెడ్డి చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గట్టు మల్లేశ్, గొల్లపల్లి ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్, నాయకులు తోట శ్రీనివాస్, ఉయ్యాల మల్లిక, మహ్మద్ జలీల్, గోవింద్‌సింగ్, చెన్నోజి శంకరయ్య, నేతరి స్వామి, సూరిబాబు, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో భద్రతకు కేంద్ర బలగాలు



సమావేశంలో మాట్లాడుతున్న రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు

పాతమంచిర్యాల: ఎన్నికల్లో భద్రతకు సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్ బలగాల సిబ్బంది 443మంది విధుల్లో ఉంటారని రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాసులు అన్నారు. గురువారం రామగుండం పోలీసు కమిషనరేట్‌లో కేంద్ర బలగాల అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజు, ఎన్నికల తర్వాత స్ట్రాంగ్ రూంల వద్ద, కౌంటింగ్ రోజు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర బలగాలకు వసతి కల్పించి వారితో కలిసి పని చేయాలని ఏసీపీలను ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వర్తించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పెద్దపల్లి డీసీపీ చేతన, మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమర్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, సీఆర్‌పీఎఫ్ అడిషనల్ కమాండెంట్లు ఏకే పాండే, పరమానంద్ యాదవ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల రివైజ్డ్ షెడ్యూల్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలా బాద్ జిల్లాలో డిగ్రీ కళాశాలల్లో ఈ నెల 6 నుంచి బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ బీఏ (ఎల్) రెండో, ఆరో సెమిస్టర్ పరీక్షలు, ఈ నెల 7 నుంచి నాలుగో సెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు పరీక్షల రివైజ్డ్ టైం టేబుల్‌ను విడుదల చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి తెలిపారు. రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 6, 8, 10, 16, 18, 21, 25, 29వ తేదీ వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వర కు, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 7, 9, 15, 17, 20, 22, 28, 30 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, ఆరో సె మిస్టర్ ప రీక్షలు ఈ నెల 6, 8, 10, 16, 18, 21, 25, 29, 31, జూన్ 7, 11, 12, 13వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

ఎండలతో ఆయిల్‌పాం తోటలు జాగ్రత్త

వేమనపల్లి: పెరుగుతున్న ఎండల వేడిని దృష్టిలో ఉంచుకుని ఆయిల్‌పాం తోటలకు నీటి యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటించాలని బెల్లంపల్లి క్లస్టర్ ఉద్యానవన శాఖ అధికారి సుప్రజ సూచించారు. గురువారం మండల కేంద్రంతో పాటు జిల్లెడలో సాగులో ఉన్న తోటలను పరిశీలించారు. డ్రిప్ పద్ధతిలో రోజుకు మైక్రోజెక్ సహాయంతో 150 నుంచి 165 లీటర్ల నీటిని ప్రతి మొక్కకు అందించాలన్నారు. మొక్క ఎదిగిన తర్వాత 250 నుంచి 330 లీటర్ల నీటిని అందించాలన్నారు. మూడేళ్ల వరకు ఆడ, మగ పూగుత్తులను తీసివేయాలన్నారు. తద్వారా పుష్పగుచ్ఛాలు పోషకాలను నిలుపుకొని ఆయిల్‌పాం మొక్క ఏపుగా పెరుగుతుందన్నారు. ఎలాంటి సలహాలు, సూచనలు కావాలన్నా 7997725034 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



తోటను పరిశీలిస్తున్న అధికారి సుప్రజ

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలటౌన్: హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 32, 33, 40 సర్వేనంబర్లలో అక్రమంగా వెంచర్లు వేసి ప్రజలను మోసగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్వచ్ఛంద పౌర సేవా సంస్థ సభ్యులు గురువారం కలెక్టర్ బదావత్ సంతోశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యదర్శి తుల మధుసూదన్‌రావు మాట్లాడుతూ కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వర్షాకాలం వరద ముంపునకు గురైన ప్రాంతాల్లోనే అక్రమ వెంచర్లను ఏర్పాటు చేసి ప్లాట్లుగా చేసి అమ్ముతున్నారని ఆరోపించారు. నివాస యోగ్యానికి పనికిరాని భూమిలో ప్రభుత్వ లేఔట్ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ప్లాట్లు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సభ్యులు నల్ల నాగేంద్ర ప్రసాద్, బల్ల శివశంకర్, దాస్య నాయక్ బానోత్, లింగన్నపేట విజయ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్వచ్ఛంద పౌర సేవా సంస్థ సభ్యులు

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

భీమిని: ఉపాధిహామీ కూలీలకు మెరుగైన వసతులు కల్పించాలని రాష్ట్ర జాయింట్ కమిషనర్ నర్సింహులు అన్నారు. గురువారం కన్నెపల్లి మండలం టేకులపల్లి, జజ్జరవెల్లి గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి పనికి తగిన వేతనం వస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. వసతులపై ఆరా తీశారు. పనుల వద్ద టెంట్, నీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మంచినీరు తక్కువగా కల్పించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్టు మేనేజర్‌లు మురళి, రఘువీర్, డీఆర్‌డీఓ



వివరాలు తెలుసుకుంటున్న జాయింట్ కమిషనర్

కిషన్, అడిషనల్ డీఆర్‌డీఓ దత్తరావు, ఎంపీడీఓ గంగామోహన్, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా శిక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో కోచ్‌లు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాజ్‌వీరు అన్నారు. కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలు చేస్తూనే క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించాలన్నారు. పిల్లలకు తాగునీటి వసతిని ఏర్పాటు చేయాలన్నారు. అన్ని వసతులు ఏర్పాటు చేసి కోచింగ్ ఇవ్వాలన్నారు. ఈ నెల 31 వరకు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిబిరం నిర్వహించాలన్నారు. అనంతరం క్రీడా శిక్షణకు అవసరమైన క్రీడా సామాగ్రిని కోచ్‌లకు అందించారు.



క్రీడా సామగ్రి అందిస్తున్న అధికారి రాజ్‌వీరు